# 12

# అత్యంత ఘనతగల సంఘము

*"ఇప్పుడైతే సీయోనను కొండకును జీవముగల దేవుని పట్టణమునకు, అనగా పరలోకపు యెరూషలేమునకును, వేవేలకొలది దేవదూతలయొద్దకును, పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకును, వారి మహోత్సవమునకును, అందరి న్యాయాధిపతియైన దేవుని యొద్దకును, సంపూర్ణసిద్ధి పొందిన నీతిమంతుల ఆత్మల యొద్దకును, క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసునొద్దకును హేబెలుకంటె మరి శ్రేష్ఠముగ పలుకు ప్రోక్షణ రక్తమునకును మీరు వచ్చియున్నారు" (హెబ్రీ. 12:22-24).*

నీవు పొందగల గొప్ప బహుమానంగా నీవు భావించేది ఏది, నీకు ప్రసాదించితే కాపాడుకోగల ఉన్నత స్థానమేది? విద్యాసంబంధమైన సాధనయా? ఆస్తి పరుల పరిధిలోనికి ప్రవేశమా? క్రీడారంగంలో మహత్తర సాధనమా? దయగల గౌరవమా? నీ కుటుంబముతో నిరంతర విజయమా?

నేను కాలేజీ విద్యార్థిగానున్నప్పుడు, నేను నిద్రించే అంతస్థులోనే అందరు కలిసి లేఖనాలు చదివి ప్రార్థన చేయడానికి కూడివచ్చేవారు. కొన్ని సార్లు, మేము మా ఆశీర్వాదాలను లెక్కించుకుండేవారము లేక ప్రతి యువకుడు తన ఆలోచనలను చెప్పే అవకాశం యివ్వబడుతూ ఉండేది. ఒక సాయంత్రపు వేళ, ఆ ప్రార్థనా సమయాన్ని నడిపించే యువకుడు, "బైబిల్లో ఏ వ్యక్తిలా నీవు ఉండగోరతావు?" అని మాలో ప్రతి ఒక్కరిని అడిగాడు. "నేను అబ్రాహాములా ఉండగోరతాను, ఎందుకంటె అతడు విశ్వాసంలో మహా గొప్పవాడు" అని ఒక యువకుడన్నాడు. ఇంకొకడు "నేను మోషేలా ఉండగోరతాను, ఎందుకంటే అతడు దేవుణ్ణి చూశాడు" అని అన్నాడు. "నేను అపొస్తులులలో ఒకనిగా ఉండగోరతాను, ఎందుకంటే వారు ప్రభువైన యేసుతో కూడ ఉండినవారు" అని మరొకడన్నాడు. "నేను హనోకువలె ఉండగోరతాను, ఎందుకంటె అతడు దేవునితో కూడ నడచినవాడు" అని యింకొకడన్నాడు. యువకులలో ప్రతి ఒక్కడు బైబిల్లో అసాధారణమైన లక్షణాలను కనుపరచి దాన్ని బట్టి ఘనత పొందిన ఒక్కొక్కనిని కోరుకున్నారు.

మరొకరికి కలిగిన కృపామయమైన అవకాశాన్ని ఆశగా చూస్తూ మనకు

ప్రసాదించబడిన గొప్ప అవకాశాలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటామని నేననుకుంటాను. క్రైస్తవులుగా మనకు ప్రసాదింపబడిన ఔన్నత్య స్థితిని, క్రీస్తునందు మనకున్న మిక్కిలి విలువగల హక్కును జ్ఞాపకం చేసికొనవలసిన అవసరముంది. క్రొత్త నిబంధనయందు జ్ఞాపకం చేసే గొప్పవాటిలో హెబ్రీ. 12:22-24 ఒకటి. క్రీస్తు వద్దకు వచ్చుటలో క్రైస్తవులు పొందిన అమూల్యమైన ఐశ్వర్యాన్ని అది సంగ్రహంగా తెలుపుతుంది.

> ఇప్పుడైతే సీయోనను కొండకును జీవముగల దేవుని పట్టణమునకు, అనగా పరలోకపు యెరూషలేమునకును, వేవేలకొలది దేవదూతల యొద్దకును, పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకును, వారి మహోత్సవమునకును, అందరి న్యాయాధిపతియైన దేవుని యొద్దకును, సంపూర్ణ సిద్ధి పొందిన నీతిమంతుల ఆత్మల యొద్దకును, క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసు నొద్దకును హేబెలు కంటె మరి శ్రేష్ఠముగ పలుకు ప్రోక్షణ రక్తమునకును మీరు వచ్చియున్నారు.

తన పాఠకులు క్రీస్తులోనికీ క్రైస్తవ్యానికీ మారబోయే సంగతిని ఆరంభించాడు. "మీరు వచ్చియున్నారు" అనేది క్రైస్తవ్యాన్ని వారు కౌగలించుకున్న సమయాన్ని సూచించే సాంకేతిక భాషగా ఉపయోగింపబడింది. ఆ మీదట క్రైస్తవులకు ప్రసాదింపబడిన పన్నెండు ప్రత్యేకమైన ఆత్మ సంబంధమైన ఆధిక్యతలను అతడు పేర్కొన్నాడు. ఈ ఆధిక్యతలలో ఒకటి - "జ్యేష్ఠుల సంఘముగా" వర్ణింపబడింది. "జ్యేష్ఠులు" అనేది గ్రీకులో ఉన్నట్టే తెలుగులోను తర్జుమా చేయబడింది. గనుక క్రైస్తవులు "జ్యేష్ఠుల సంఘమునకు చెందినవారైనట్టు" అది సూచిస్తుంది. క్రొత్త నిబంధన అంతటిలో ఒక్కసారే ఉన్న ఈ వర్ణనాపదం క్రీస్తు సంఘముగా జీవించే క్రైస్తవునికి అనుగ్రహింపబడిన ప్రత్యేకమైన అంతస్థును వ్యక్తపరచుతోంది.

## ఆ సత్యం

యూదా మతాన్ని వదలుకొని క్రైస్తవులైన తరువాత పరిస్థితుల ఒత్తిడులకులోనై నిరాశపడి, క్రీస్తునందు తమ విశ్వాసాన్ని వదలుకొనే అంచుకు వచ్చిన క్రైస్తవులకు హెబ్రీ పత్రిక వ్రాయబడింది. వారి క్రైస్తవ గమనంలోని ప్రతి అడుగున హింసలు, విగ్రహ సంబంధమైన ఒత్తిళ్లు వారిని చుట్టుకొని ముండ్లవలె గుచ్చుతూ వారిని బాధిస్తున్నాయి. ఇట్టి కఠినమైన బాధనుండి విముక్తిని కనుగొనడానికి గాను, ఏ యూదామతంనుండి వారు మార్పు చెంది వచ్చారో తిరిగి దానిలోనికే వెళ్లేలా అనేకులు శోధింపబడుతున్న సమయమది.

క్రైస్తవ్యమందున్న శ్రేష్ఠమైన ఆధిక్యతలను, దేవుడు నరునికి ప్రసాదించిన రమ్యమైన ఆశీర్వాదముల విలువను తన పాఠకులకు ఈ పత్రికయంతటిలో దైవ ప్రేరేపితుడైన రచయిత వివరిస్తూ, ఎందుకు వాటిని ఘనంగా ఎంచాలో పలు కారణాలనిచ్చాడు. క్రీస్తునుండి యూదా మతానికి తిరిగి వెళ్లడం అనేది, శ్రేష్ఠమైన దానినుండి హీనమైన దానికిని, నిజ స్వరూపంనుండి ఛాయలోనికిని తిరిగి వెళ్లడమే ఔతుందని ఆ పుస్తకం తీర్మానిస్తుంది. హెబ్రీ. 12:22-24లో, క్రీస్తునందు క్రైస్తవులు అనుభవించు ముఖ్యమైన

ఆధిక్యతలను ఒక్క ప్రతిపాదనలోనే అతడు కుదించాడు. క్రైస్తవుడు క్రైస్తవ్యంనుండి ఏ మతానికి మారిపోకూడదంటూ ఒకే దెబ్బతో కావలసినంత రుజువును అతడిచ్చాడు.

పాత నిబంధనలోని దేవుని ప్రజలు సీనాయి పర్వతం వద్దకు వచ్చారు. అక్కడ వారికి ధర్మశాస్త్రమియ్యబడింది. దేవుని నీతియు, పాపము పట్ల ఆయన తీర్మానము అగ్ని, పొగ, ఉరుము, మెరుపులవల్ల ప్రత్యక్షమయ్యాయి. దానికి భిన్నంగా, క్రైస్తవులు సీయోనను కొండకును, జీవముగల దేవుని పట్టణమునకును, పరలోకపు యెరూషలేము నకును వచ్చియున్నారు. క్రైస్తవ యుగంలోను వారు దేవుని వద్దకు వచ్చారు. ఇది కృపాయుగం. మరియు వారు ఆత్మ సంబంధంగా పరలోకపు యెరూషలేములో పాలుగలవారై ఉంటారు. అలా వారు కలిగియున్నప్పుడు, వారు వేవేలకొలది దూతల సహవాసంలో ప్రవేశిస్తారు, దేవుని సముఖంలో వారు స్తుతిగానం చేస్తారు. వారు పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘంలో ప్రవేశిస్తారు. పాత నిబంధన కాలంలో ఉండిన నీతిమంతుల ఆత్మలతో కూడ వారు జతచేయబడతారు. పాత నిబంధన కాలంలోని నీతిమంతులు సంపూర్ణ సిద్ధ పొందినవారు. ఆయన సిలువ రక్తంవలన వారు క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసు వద్దకు వస్తారు. క్లుప్తంగా చెప్పాలంటే, ప్రభువైన యేసు యొక్క ఆహ్వానాన్ని వారు అంగీకరించినందున, లోక రక్షణకొరకు దేవుని సంకల్పం చేసే చిట్ట చివరి నెరవేర్పులో పాలుపొందుతారు.

---

**మనం పొందే ఎలాటి ఘనతకంటెను**
**గొర్రెపిల్ల యొక్క జీవగ్రంథంలో వ్రాయబడ్డాం**
**అనేది మనకు ఎక్కువ సంతోషం కలుగజేయవలసి ఉంటుంది.**

---

అందువలన, క్రైస్తవ యుగానికి ఏకైకంగా చెందిన పరలోక సంబంధమైన వరములను క్రైస్తవులు పొందారు. వారు మోషే ధర్మశాస్త్రం క్రింద జీవించారు. అది కృపకంటె చట్టాన్ని, కనికరం కంటె న్యాయాన్ని నొక్కి పలుకుతుంది. దానినుండి క్రైస్తవులకు విడుదల కలిగింది. గనుక వారు పరలోక యెరూషలేములో పాలుగలవారైయుంటారు. అంటే, పరలోక సంబంధమైన లోకానికి, భూ సంబంధమైన లోకానికి గల దేవుని ఏలుబడిలో వారు పాలివారైయుంటారు. ఎడతెగక దేవుని చిత్తాన్ని జరిగిస్తూ దేవుని ఆరాధించి సేవించే వేవేల కొలది దేవదూతలతో – దేవుని ప్రేమ, స్తుతి, సేవ అనేవాటిలో వారు ఏకీభవించువారై ఉంటారు. క్రైస్తవులు పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకును వారి మహోత్సవమునకును వచ్చియున్నారు. ఇప్పుడు నిత్యత్వంలో చేరియున్న పాత నిబంధన కాలపు నీతిమంతుల ఆత్మలతో వారు జతకూడియున్నారు. ప్రభువైన యేసు యొక్క రక్తంవలనను, కృపవలనను అనుగ్రహింపబడిన క్రొత్త నిబంధనయందు క్రీస్తుద్వారా వారు దేవుని వద్దకు వచ్చినవారైయున్నారు.

ఈ ఆశీర్వాదముల జాబితా అంతటిలో మన అక్కర లేక అభిలాష, "జ్యేష్ఠుల సంఘము" అనే దానిమీద ప్రత్యేకంగా ఉంది. "జ్యేష్ఠుల" అనే పదం అసాధారణంగా

ముఖ్యమయ్యింది ఎందుకంటె అది అత్యున్నతమైన గౌరవాన్ని సూచిస్తుంది. పాత నిబంధనలో ఈ పదానికి కోరదగిన మర్యాద ఉంది. ప్రాధాన్యతతో కూడిన ఘనత అనేది దీని భావమైయుండనగును. ఎందువలనంటే, ఒక కుటుంబంలోని సంతానంలో జ్యేష్ఠునికి రెట్టింపు సన్మానం కలుగుతోంది. అది స్థితి యొక్క ఘనతను సహితం సూచిస్తుంది.

ఈ రెండు కారణాలను బట్టి లేఖనాలలో ప్రభువైన యేసు జ్యేష్ఠుడైనట్టు పేర్కొనబడ్డాడు. మొదటిది, ఆయన ప్రాధాన్యతలో జ్యేష్ఠుడైయున్నాడు ఏలాగంటే, మృతులలోనుండి లేచుటలో ఆయన ఆది సంభూతుడయ్యాడు. పౌలు యిలా వ్రాశాడు: "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతు డాయెను" (కొలస్సీ. 1:18). రెండవది, స్థితి లేక అంతస్థులో ఆయన జ్యేష్ఠుడైయున్నాడు. దేవుడు ఆయనను అత్యధికముగా హెచ్చించి, అందరికంటెను ఆయనను పైగా నియమించాడు. పౌలు యింకను యిలా వ్రాశాడు, "ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడైయున్నాడు" (కొలస్సీ. 1:15; హెబ్రీ. 1:6తో పోల్చి చూడు). ఈ వచనంలో, ఆయన ప్రాధాన్య కారణంగా జ్యేష్ఠుడు కాదు ఎందుకంటే ఆయన సృజింపబడినవాడు కాదు; తండ్రియైన దేవునివలెనే, ఆయన జీవితానికి అంతం లేనివాడై, యుగయుగములు సజీవుడైయున్నాడు. అయితే, శ్రేష్ఠమైన స్థితిలో, సృజింపబడిన లోకానికి ప్రభువుగా ఈ వచనం ఆయనను ఆదిసంభూతుడని లేక జ్యేష్ఠుడని సూచిస్తుంది.

ప్రభువైన యేసుకు యిది ఉపయోగింపబడినట్టే, ప్రత్యేకతను సూచించడంలో విశేష రూపంగా, "జ్యేష్ఠుడనే" పదం సంఘానికి వర్తింపజేయబడింది. సంఘము "జ్యేష్ఠుల సంఘమైయుంది." దేవుడు దానికి ఆధిక్యతలననుగ్రహించాడు; జ్యేష్ఠ పుత్రునికి యివ్వబడిన రెట్టింపు సన్మానాన్ని ఆయన దానికిచ్చాడు. క్రీస్తు సంఘముగా విమోచింపబడిన వారికుండే ఉన్నతమైన స్థితి ఆయన కృపవలననే ప్రసాదింపబడుతుంది; అది మొదట వచ్చి ఉన్నందున కలిగింది కాదు లేదా ఎవరికంటెను శ్రేష్ఠులమైనందున వచ్చింది కాదు. నీతిమంతులుగా తీర్చబడే స్థితిపై అది ఆధారపడియుంది.

## సత్యము విస్తరింపజేయబడింది

మహిమాయుక్తమైన ఈ సత్యము తరచుగా "ప్రకాశింపజేయబడి" క్రొత్త నిబంధనలో ఉదహరింపబడింది.

### ముందుగా వెళ్లిన వానికంటెను ఎక్కువైన ఘనత

బాప్తిస్మమిచ్చు యోహాను క్రైస్తవ యుగంలో జీవించలేదు. తదనుసారంగా, అతడు ఎన్నడు సంఘములో ఉండినవాడు కాడు. గొప్పవారైన దేవుని ప్రజలలో అతడొకడు. అయినా క్రైస్తవులు అనుభవించే దీవెనలను అతడు ఎన్నడూ పొందలేదు. ఈ కారణాన్ని బట్టి, యోహానును గూర్చి ప్రభువైన యేసు యిలా అన్నాడు: "స్త్రీలు కనినవారిలో

బాప్తిస్మమిచ్చు యోహానుకంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. అయినను పరలోకరాజ్యములో అల్పుడైనవాడు అతనికంటె గొప్పవాడు" (మత్తయి 11:11). మెస్సీయా యొక్క రాకకొరకు మార్గం సిద్ధపరచువాడనే అభినందనకంటె ఒకడు పొందగలిగిన ఘనత ఏముంటుంది? దేవుని రాజ్యంలో ఉండడంలో కలిగే లాభాలు అమోఘమయ్యాయి: క్రీస్తుకు ముందు ఆయన మార్గాన్ని సరళం చేయడానికి వచ్చిన యోహాను గొప్పవాడనేది నిస్సందేహం. అతని అడుగుజాడల ననుసరించిన వారికంటె రాజ్యంలో ఉన్నవారు గొప్పవారని ప్రభువు సూచించాడు. అంతేకాదు క్రీస్తును లోకానికి పరిచయం చేసిన ఘనత ఆ యోహానుకే దక్కుతుంది. అయినా, దేవుని రాజ్యంలో ప్రవేశించిన ప్రతి క్రైస్తవుడు అతనికంటె అధికమైన ఘనతను పొందుతాడు.

**అద్భుతాలు చేయడం కంటె ఎక్కువైన ఘనత**

ప్రభువైన యేసు పరిచర్యలోని ఆరంభ కాలంలో, పరిమితియగు ఆనతి క్రింద వివరంతో కూడిన ఆజ్ఞలతో డెబ్బైమంది శిష్యులు పంపబడ్డారు. ప్రభువు వారిని ఇద్దరిద్దరినిగా "తనకు ముందుగా" పంపాడు. ఆయన బోధించబోతున్న ప్రతి స్థలానికి వీరు ముందుగా వెళ్లారు (లూకా 10:1). అద్భుతాలు చేయడానికిని దయ్యాలను వెళ్లగొట్టడానికిని ఆయన వారికి అధికారమును, బలమును యిచ్చి పంపాడు. వారు తిరిగి వచ్చినప్పుడు, తమకు దయ్యాలు లోబడినందుకు, క్రీస్తు పేరు చెప్పి ఆదేశించి దయ్యాలు పట్టుకున్నవారినుండి విడిపించినందుకు, ఎంతో ఉత్సాహంతోనూ, ఆనందంతోనూ కనిపించారు. ఆ విషయాన్ని వారు ప్రభువునకు సగర్వంగా విన్నవించుకున్నారు.

అద్భుతం చేయడం అంటే ఎలా ఉంటుందో నేను ఊహించలేను. ఒకనికి మరణాంతకమైన రోగం ఉందనుకో దానిని అద్భుతరీతిగా బాగుచేయగలగడం. దేవుని శక్తి నీ ద్వారా ప్రవహించి, అలాటి స్వస్థత చేకూర్చగలిగినప్పుడు నీవు ఆనందిస్తావు! మొదటి శతాబ్దపు చివరి భాగానికి అద్భుతాలు చేసే కాలం అంతరించింది, దేవుని ప్రత్యక్షతయైన – బైబిలు పూర్తి చేయబడడంతో అది జరిగిపోయింది. నేడు అద్భుతాలు చేయగల శక్తి ఎవనికిని లేకపోయినా, దయ్యములను వెళ్లగొట్టగలిగిన ఆ శిష్యులు ఆనందంతో తిరిగి వచ్చిన విషయాన్ని సులభంగానే గ్రహిస్తున్నాం!

తమ సంతోషాన్ని వారు ప్రభువైన యేసునకు తెలియజేసినప్పుడు, నమ్మశక్యంకాని మాటలను ఆయన వారితో అన్నాడు: "ఇదిగో పాములను తేళ్లను త్రొక్కుటకును శత్రువు బలమంతటిమీదను మీకు అధికారము అనుగ్రహించియున్నాను; ఏదియు మీ కెంత మాత్రమును హానిచేయదు. **అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని వారితో చెప్పెను**" (లూకా 10:19, 20; ఒత్తి పలకడం నాది). మరో విధంగా చెప్పాలంటే, అద్భుతాలు చేయడంకంటె వారి దృష్టి యింకా శ్రేష్ఠమైనదానియందు నిలపాలని ప్రభువు వారికి సూచించాడు. మానవాతీత శక్తితో నింపబడడంకంటె, జీవగ్రంథంలో పేరు వ్రాయబడి ఉండడమే గొప్ప!

మోషే ధర్మశాస్త్రం ఇంకా అమలులో ఉన్న దినాల్లో ఆ శిష్యులు జీవించారు (హెబ్రీ. 9:15-17). మోషే యుగంలో అద్భుత శక్తులను ప్రయోగించడం కంటె జీవగ్రంథంలో పేర్లు వ్రాయబడడం గొప్పదైనప్పుడు, క్రైస్తవ యుగంలో జీవగ్రంథమందు పేరు వ్రాయబడి ఉండడం మరి యింక ఎంత విలువగలదై ఉంటుందో! ఇది కడపటి యుగపు కాలం, రక్షించు దేవుని సంకల్పం నెరవేర్చబడే యుగం. హెబ్రీ రచయిత ప్రకారం, క్రైస్తవ యుగంలో పరలోకమందు వ్రాయబడినవారు సంఘమే. బాగా అభిమానింపబడినవారితో కూడిన సంఘం. పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘం అని పిలువ బడడంలో ఆశ్చర్యం లేదు.

### భూ సంబంధమైన గౌరవపాత్రకంటె మిన్నయైన ఘనత

నరుడు పొందే ఘనతలన్నింటికంటె గొర్రెపిల్ల యొక్క జీవగ్రంథంలో వ్రాయబడడం అధిక సంతోషానికి హేతువైయుండాలి. ఫిలిప్పీ పట్టణంలో సువార్తకు సహకారులైన వారిని గూర్చి, "వారి పేరులు జీవగ్రంథమందు వ్రాయబడియున్నవి" అని పౌలు తెలిపాడు (ఫిలిప్పీ. 4:3). లోక మాలిన్యంచేత తమ వస్త్రములను అపవిత్రపరచుకొనని సార్దీస్ సంఘంలోని ప్రతివానిని గూర్చి ప్రభువు యిలా అన్నాడు: "జీవ గ్రంథములోనుండి అతని పేరెంతమాత్రము తుడుపు పెట్టక ..." (ప్రకటన 3:5). జీవ గ్రంథమందు ఎవని పేరైనను వ్రాయబడినట్టు కనబడనియెడల, వాడు అగ్ని గుండములో పడవేయబడునని యోహాను వ్రాశాడు (ప్రకటన 20:15).

రోమా పౌరుల పేర్లన్నీ కలిగియున్న ఒక ప్రధానమైన జాబితాను సామ్రాజ్య సంబంధమైన పట్టణపు ఏలికలు ఉంచుతూ ఉండేవారు. మొదటి శతాబ్దంలోని వారికి హెబ్రీ రచయిత చెప్తున్నదేమంటే - రోమా పౌరుల జాబితాకంటెను ఎంతో ముఖ్యమైన జాబితా పరలోకమందు ఉంచబడిందని. ఒకని పేరు ఆ రికార్డులో కన్పించినప్పుడు, అతనికి అత్యున్నతమైన ఘనత కలుగుతుంది. రక్షింపబడినవారికి సంబంధించిన దేవుని జాబితా అది. ఈ ఘనత సంఘానికి చెందినట్లు హెబ్రీ రచయిత తెలిపాడు!

### పాత నిబంధనకంటెను మిన్నయైన ఘనత

"దేవునికి నమ్మకస్థులైన వారి హాల్ ఆఫ్ ఫేమ్" అని హెబ్రీ 11 పిలువబడింది. ఆ ప్రత్యేకమైన అధ్యాయంలో హేబెలు, హనోకు, నోవహు, అబ్రాహాము, శారా, యాకోబు, యోసేపు, మోషేవంటి పదిహేడు మంది స్త్రీ పురుషుల భావచిత్రాలు యివ్వబడ్డాయి. లోకమంతయు స్మరించుకోడానికి గాను ఈ పాత నిబంధన వ్యక్తులను దేవుడు ఎన్నిక చేసికొన్నాడు. ఆశ్చర్యకరంగా, ఈ కథానాయకులను గూర్చి యిలా అన్నాడు, "వీరందరు తమ విశ్వాసముద్వారా సాక్ష్యము పొందినవారైనను, మనము లేకుండ సంపూర్ణులు కాకుండు నిమిత్తము, దేవుడు మనకొరకు **మరి శ్రేష్ఠమైనదానిని** ముందుగా సిద్ధపరచెను గనుక వీరు వాగ్దానఫలము అనుభవింపలేదు" (హెబ్రీ. 11:39, 40; ఒత్తి పలకడం నాది). "మరి శ్రేష్ఠమైనది" ప్రభువు అవతరించడం, మరియు సంఘం. జ్యేష్ఠుల సంఘంగా,

హెబ్రీ. 11లోని గొప్పవారు మనకొరకు ఎదురు చూస్తున్నారనే ఘనతచే మనం ఆశీర్వదింపబడ్డాం. వాస్తవంగా వారు చూడలేదు, వాగ్దానంగానే వారు దానిని చవిచూచారు.

### భూమిమీదనున్న పరిస్థితులన్నింటికంటెను అధికమైనది

అమెరికాలోని అతిపెద్ద స్థానిక సంఘాలలో ఒకటైయున్న నాషెవిల్లె, టెనెస్సీలోని మాడిసన్ సంఘంలో ఒకసారి చార్లెస్ హోడ్జే మాట్లాడుతున్నాడు. అక్కడ ఉన్నప్పుడు, వారి కట్టడం ఎలా డిజైన్ చేయబడింది, అక్కడ ఏమి జరుగుతుందని అతడు తిరిగి చూచాడు. పోష్టు చేయడానికి ఉత్తరాలు మడుస్తున్న ఒక వృద్ధ స్త్రీ గదిలో తొంగి చూడగా అతనికి కన్పించింది. “నీవెవరవు?” అని అతడామెనడిగాడు. “ఈ సంఘంలో అతి ప్రాముఖ్యమైన వ్యక్తులలో నేనొకదాన్ని” అని ఆమె వెంటనే బదులిచ్చింది. “అవునా? అది నీకెలా తెలుసు?” అని అతడడుగగా, “నేను అలాగని సహోదరుడు నార్త్ చెప్పాడని” ఆమె అంది. వారి గొప్ప సువార్తికుడైన ఇరా నార్త్ ఆ సంగతి సరిగానే చెప్పాడు. ఆమె పని ఎవరి పనికంటెను తీసిపోదు. పెద్దలు, పరిచారకులు, సువార్తికులు ఎంత ప్రాముఖ్య మైనవారో, యింకెవరైనా ఎంత ప్రాముఖ్యమైనవారో ఆమె కూడా అంతే ప్రాముఖ్యమైనది!

“నీవు నా సంఘంలోనికి వచ్చినప్పుడు, నీకు నేను గౌరవం ఆరోపించి, జ్యేష్ఠుల సంఘమని నేను నిన్ను పిలుస్తాను అని దేవుడన్నాడు. బాప్తిస్మమిచ్చు యోహానుకు నేను ప్రసాదించిన పనికంటెను, స్థితికంటెను మిన్నయైన గుర్తింపు నేను నీకిచ్చాను. అల్పుల వద్దనుండి ఘనులవరకు ఈ ఘనతను ప్రతి ఒక్కరికి ఏకరీతిగా అనుగ్రహించాను” అని దేవుడు అన్నాడు.

## సత్యము వర్తింపజేయబడింది

క్రొత్త నిబంధన సంఘము జ్యేష్ఠుల సంఘమై ఉన్నదనే సత్యము సంపూర్ణమైన వ్యక్తిగత విధేయతను ప్రతి సంఘ సభ్యునినుండి చూరగొనాలి. అటు క్రీస్తువైపుకును యిటు నరునివైపుకును చేరేలా అది మనలను ప్రేరేపించాలి. జీవితానికి ఈ సత్యాన్ని నిర్ధిష్టంగా ఎలా వర్తింపజేయాలి?

మొదటిది, **పొర్లిపారే కృతజ్ఞతను మనం కలిగియుండాలి**. దేవుడు కేవలం మనలను రక్షించడం మాత్రమేగాక, దాట శక్యం కానంత ఘనతగల స్థానాన్ని కూడా ఆయన మనకు దయచేశాడు. ఆయన మనలను తన సంఘంగా చేసికొనడం మాత్రమేగాక, ఆయన మనలను జ్యేష్ఠుల సంఘంగా కూడా చేశాడు, రెట్టింపు సన్మానంగల సంఘంగా చేశాడు! దీని వెలుగులో, “ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి...” పౌలు యొక్క శాసనానికి లోబడడం మనకు కష్టమై ఉండకూడదు (1 థెస్స. 5:18).

రెండవది, **ఇతరులకు మనము దేవుని కృపకు వ్యక్తీకరణగా ఉందాం**. ఆయన కృప మనకు ప్రభువైన యేసు అనే వ్యక్తిలో ప్రత్యక్షమయ్యింది (తీతు 2:11), అది అతి సాధారణమైనదైనా అతి ముఖ్యమైన ధోరణిలో మనచుట్టునున్నవారికి ఆయన కృపను

చూపుదాం. దేవుడు మనమీద కుమ్మరించిన ఈ అద్భుతమైన ఘనతను ఎరుగనివారికి దాన్ని మనం పంచవలసియుంటాం.

మూడవది, **చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి** మనలను పిలిచినవాని గుణాతిశయములను స్తుతించుదాం. ఎందుకంటె మనం ఒకప్పుడు ప్రజగా ఉండక, యిప్పుడు దేవుని ప్రజయైతిమి (1 పేతురు 2:9, 10). గాలి పీల్చుకొనడం ఎంత సహజమో, ఆయన కృపా మహిమలకు కీర్తి కలిగించడం మనకంత సహజమైయుండాలి.

నాల్గవది, **దేవుని సొత్తయిన ప్రజలముగా, మనం ఎల్లప్పుడు దేవుని సేవించుటయందు నిమగ్నమై ఉందాం**. నిశ్చలమైన రాజ్యమును మనము పొందినందున, కృతజ్ఞతను ప్రదర్శించుదము. దానిద్వారా దేవునికంగీకారమైన సేవను భయభక్తులతో చేద్దాం (హెబ్రీ. 12:28). మన శరీరములను ఆయనకు సజీవయాగంగా సమర్పించుదాం (రోమా 12:1).

## ముగింపు

హెబ్రీ పత్రిక యొక్క రచయిత ప్రకారం, క్రొత్త నిబంధన సంఘము – జ్యేష్ఠుల సంఘమైయుంది. తన సంఘమునకు దేవుడు పరలోక సంబంధమైన నిత్య మహిమను పంపాడు. దానితో ఈ లోక సంబంధమైన స్తోత్ర వచనాలు నిష్ప్రయోజనమైన అస్థి సంచయము (బూడిద) గాను, నలిగిపోయిన గడ్డిగాను మిగిలిపోతుంది.

దేవుని కృపను పొందకుండ తప్పిపోదుమేమోనని హెచ్చరించడానికి రచయిత ఏశావును మనకు ఉదాహరణగా ఉపయోగించాడు (హెబ్రీ. 12:15, 16). విశ్వాసము లేని కారణాన, మనకు కలిగియున్న నిత్య ఆశీర్వాదములను మనం పోగొట్టుకొనవచ్చు (1 పేతురు 1:10–13). ఏశావు అపవిత్రుడు, నిత్యత్వం కొరకు కాక తాత్కాలికమైన వాటికొరకు బ్రదికినవాడు.

“పవిత్రమైనవాటిని అలక్ష్యము చేయు” అనే పదాలు లోక సంబంధమైనవి; *profanus* అనే లాటిన్ పదంనుండి వచ్చింది. ప్రతి దేవాలయమునకును వెలుపల (లాటిన్: *fanum*) అనేది ప్రతివానికి తెరువబడిన ప్రాంగణం. దీనికి భిన్నంగా దేవాలయపు ఆవరణం అనేది ఉంటుంది. ఇది పవిత్రమైన స్థలంగా భావించబడుతుంది. ప్రజలు కూడే బహిరంగ స్థలాన్ని పవిత్రం కాని భాగంగా భావిస్తారు. ఏశావు పవిత్రమైనవాటిని లక్ష్యపెట్టనివాడు, తన జీవితానికి ఏ పవిత్రతను చుట్టుకోలేదు, అతని ఆత్మను మార్చుకొనవలసినది, పరిశుద్ధమైనది ఏదీ లేదు. తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మివేయడంలో అతడు తన శీలాన్ని, తన అంతరంగ విలువలను బయలుపరచాడు. నిత్యత్వపు దృష్టిలేనివాడుగా అతడు జీవించాడు. భౌతికమైన వ్యక్తిగా, తన ఉద్దేశాలు, గమ్యాన్ని నిలుపుకున్నాడు. తరువాత, ఏశావు ఆశీర్వాదం పొందగోరాడు గాని అది అతనికి అందకుండానేపోయింది. అమూల్యమైన అవకాశాలను అతడు అమ్ముకున్నాడు, మారుమనస్సు పొందే అవకాశము దాటిపోయింది.

ఏశావు యొక్క స్వార్థమైన, అపవిత్రమైన జీవితం నీకు హెచ్చరికగా ఉండనిమ్ము. సంఘంగా నీకు చెందవలసిన నిత్య ఘనతపై నీ హృదయం నిలువకుండా తప్పిపోతుందే

మోయని జాగ్రత్త కలిగియుండు. దేవుని సొత్తయిన ప్రజలుగాను, జ్యేష్ఠుల సంఘముగాను నీవు జీవించకుండ అడ్డుకునే దానిని తొలగించుకొమ్ము. గతంలో నీవెన్నడు ఘనపరచబడనంతగా ఆయన నిన్ను ఘనపరచగోరుతున్నాడు. మనుష్యులు నిన్ను నశించే కిరీటములతో గౌరవించగలరు, కాని నేడు నిజమైన జీవితాన్నీ, తరువాత నిత్య జీవితాన్నీ నీకు ప్రసాదించగలడు.

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. ఘనత ఏది?
2. బైబిలు వ్యక్తులలో ఎవనివలెనైనను నీవు జీవింపగోరితే నీవు ఎవరివలె ఉండగోరతావు.
3. హెబ్రీ. 12:22లో "మీరు వచ్చియున్నారనే" మాటలు దేన్ని సూచిస్తాయి?
4. హెబ్రీ పత్రిక పొందిన క్రైస్తవుల యొక్క పరిస్థితులను వర్ణించుము.
5. నమ్మకమైన ఇశ్రాయేలీయులకు లేని, క్రైస్తవులకు మాత్రమే ఉన్న కొన్ని ఆశీర్వాదములను పేర్కొనుము.
6. లేఖనాల్లో "జ్యేష్ఠులు" అనే పదం ఉపయోగింపబడిన రెండు విధానాలను నిర్వచించుము.
7. ప్రభువైన యేసు వర్తింపజేయబడినప్పుడు "జ్యేష్ఠుడు" అనే పదం ఎలా ఉపయోగించబడింది?
8. సంఘానికి సంబంధించి "జ్యేష్ఠులు" అనే పదం ఎలా వినియోగింపబడింది?
9. క్రైస్తవులకు సంఘములో ఉన్న గొప్ప ఘనత ప్రజ్వలింపజేయు ఉదాహరణల నిమ్ము.
10. ఒకని పేరు పరలోకమందు వ్రాయబడిందంటే అర్థమేమో వివరించుము.
11. హెబ్రీ. 11:39, 40లో "మరి శ్రేష్ఠమైనదానిని" వివరించుము.
12. క్రీస్తునందు మనకు ప్రసాదింపబడిన ఘనతకు మనమెట్టి ప్రత్యుత్తరమివ్వాలి?